# ముసలమ్మ

"ఈ రోజు టిఫినేం చేయమంటారు?" భర్తనడిగింది శ్రీజ.

"టిఫినా? ఇంకా నయం. వంటేం చేసేదని అడగలేదు" అన్నాడు కరుణాకర్ కంగారు పడిపోతూ.

"ఆదివారం కదా. అందుకని అడిగా"

"నిజమే డియర్! కానీ ఈ రోజు మ్యారేజ్‌కి వెళ్ళాలిగా. మర్చిపోయావా?" భార్యకి గుర్తు చేశాడు.

"తెలుసులెండి. ముహూర్తం పదకొండుకి. టిఫిన్ తినకుండా ఎలా వెళతాం?" ప్రశ్నించింది.

"దుబారా ఖర్చులరావు కి స్వయానా చెల్లెలివి తల్లీ! అయినా నీకు బొత్తిగా పొదుపు చేయడం తెలీదోయ్"

"మీ పిసినారితనంతో చంపుతున్నారు. ఇందులో దుబారా ఏముందండీ? మన కోసం టిఫిన్ చేసుకోవడం అదొక ఖర్చా? ఎవరైనా వింటే నవ్వుతారు" మూతి మూడు వంకర్లు తిప్పేసింది.

"నవ్వేవాళ్లకేం తెలుస్తుందిలే నయాపైస విలువ. ఫ్రెండ్ వెంకూగాడి ఇల్లు ఫంక్షన్ ప్యాలెస్ తోవేగా. కలిసి వెళదాం రమ్మన్నాడు. పిలిచిన వాడు కాఫీలు టిఫిన్లు పెట్టక వదుల్తాడా? ఇంతోటి దానికి మనింట్లో ఈ టిఫిన్ ప్రహసనమెందుకట. పైగా నీకూ శ్రమ కాకపోతే!" ఎప్పటిలానే భార్యకి వీర లెవల్లో పొదుపు ఉపదేశం కావించాడు కరుణాకర్.

అరచేత్తో నుదురు చరుచుకుంది శ్రీజ.

"అబ్బా! మీ పిసినిగొట్టు బుద్ధులు మాత్రం మన తేజగాడికి అస్సలు రాకూడదండీ. ఇంట్లో టిఫిన్ ప్రోగ్రాం పెట్టను గానీ వాడిని చూస్తూ ఉండండి. మీరు షేవింగ్ చేసుకునేలోగా

నేను స్నానం చేసి రెడీ అవుతాను" భర్తకు చెప్పి బాత్రూంలో దూరింది.

షేవింగ్ కిట్ తీసుకొని బయట గది కిటికీ గ్రిల్‌కి అద్దం తగిలించి షేవింగ్ పనిలో నిమగ్నమై పోయాడు.

తల్లి ఇచ్చిన ఆపిల్‌ని కొరుక్కుని తింటూ డోర్ మెట్ల దగ్గర బుద్ధిగా కూర్చున్నాడు తేజ.

"నమస్తే సార్!"

బ్రష్‌తో గడ్డానికి క్రీమ్ రాసుకుంటున్న కరుణాకర్ ఆ మాటకి కిటికీ నుండి బయటకు చూశాడు.

కిటికీ ఎదురుగా నిలబడి ఉన్నారిద్దరు చిర్నవ్వుతో. గతంలో వాళ్ళని చూసినట్టు లేదు. అపరిచితులు.

"ఎవరు కావాలండీ?" అనడిగాడు.

"అనాథ శరణాలయం నుండి వచ్చామండీ" బదులిచ్చాడొకాయన.

షేవింగ్ బ్రష్ టీపాయ్ మీదుంచి పక్కనే ఉన్న డోర్ చెంత నిలబడి "ఆ... చెప్పండి" అన్నాడు.

"కరీంనగర్ రోడ్డులో అనాథ శరణాలయం ఉంది. యాభై మంది పిల్లలుంటారు. మీకు తెలిసే ఉంటుంది. చందా కోసం వచ్చాం"

"మీరిరువురూ..."

"మేమే ఈ శరణాలయాన్ని నిర్వహిస్తున్నాం సార్"

"అలాగా!"

"సమాజ సేవ చేయాలన్న తలంపుతో జస్ట్ త్రీ ఇయర్స్ నుండి ఈ యజ్ఞం నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా మీలాంటి దాతల అండదండలతో సాఫీగా కొనసాగుతోంది" చాలా సౌమ్యంగా చెప్పాడు.

వాళ్లెందుకొచ్చారో స్పష్టమైంది. అందుకని లోపలికొచ్చాడా రమ్మన్లేదు. వాళ్లదేం పట్టించుకోలేదు.

"మీకు తోచినంత చందా రాసి అనాథ పిల్లలకు మీ వంతు సహాయ సహకారాలు అందించండి" తిరిగి చెప్పాడు.

"ఈ మధ్యే మా ఇంట్లో ఫంక్షనయ్యింది. అలాగే తుపాను బాధితులకంటూ వన్ డే సాలరీ కట్ అయింది. నేనా చిరుద్యోగిని. ఇప్పటికిప్పుడు మీక్కూడా చందా రాయాలంటే బడ్జెట్ సహకరించదు. అర్థం చేసుకోండి..."

"ఖర్చులెప్పుడూ ఉండేవే కదండీ! ఎంతో కొంత ఎమౌంట్ రాయండి"

"ఆర్థిక వెసులుబాటు కానివ్వండి. ఇప్పుడు రాయను" నిర్మొహమాటంగా చెప్పేశాడు.

"ఇట్సోకే సార్! మరొకరి దగ్గరికెళతాం. నిధులు నిండుకున్న ప్రతిసారీ మాకిది

సహజమే. మీరు మాత్రం ఈ అనాథ శరణాలయాన్ని విస్మరించకండి..." చెప్పి వెనుదిరిగారు వాళ్లు.

'లేచిన ఘడియ మంచిదయ్యింది. లేకపోతే ఎంతో కొంత డబ్బు వదిలేది. చందా అట చందా. బ్రతికిపోయా!' గట్టిగా ఊపిరి పీల్చుకొని తన పనిలో పడిపోయాడు.

"రొండు దినాలయ్యింది... ఓ ముద్ద తిని. పేగులు ఉండ సుట్టుకు పోతున్నై. జర... బువ్వెయ్యవ్వో..." వణుకుతున్న కంఠస్వరంతో దైన్యంగా విన్పించిందో అరుపు.

చప్పున కిటికీ గుండా తొంగి చూశాడు కరుణాకర్. వృద్ధురాలొకతి కనపడిందతనికి.

"ప్రహారీ గోడ లేకపోవడంతో... అందరికీ రాజమార్గమై పోయింది. ఇంటి ముందుకి రావడానికి. ఛఛ" విసుక్కున్నాడు.

"అవ్వా... తల్లీ" మళ్లీ విన్పించింది.

"పో! పో!" కసురుకున్నాడు.

వంగిన నడుము, పీక్కుపోయిన వదనం, వణుకుతున్న దేహం ఆమె వార్ధక్యానికి చిహ్నాలై నిలుస్తున్నాయి.

భుజానికో ముల్లె, చేతిన సత్తుగిన్నె, ఎండిన డొక్క ఆ ముసలమ్మ దైన్యస్థితిని ప్రతిబింబిస్తున్నాయి.

"పోనీ... రొండ్రూపాయలుంటియ్యి సారూ... పోయి గుక్కెడు చాయ్ నీళ్లన్న తాగుత" ఆశగా వేడుకుంది.

కరుణాకర్‌కి కోపం నషాళానికంటింది.

"రెండ్రూపాయలేనా... రెండొందలొద్దా? డబ్బులేమైనా చెట్టుకు కాస్తున్నాయను కున్నావా? అడుక్కోవడం అందరికీ ఓ పనై పోయింది. ఎళ్లెళ్లు..." కంఠస్వరం హెచ్చించాడు.

ఏ స్థితి... ఆమెనీ పరిస్థితిలోకి నెట్టేసిందో గానీ... మోడులా నిలబడి పోయిందలాగే. అతడి మనసు మాత్రం కరుగలేదు.

గబుక్కున గడప దిగిన చిన్నారి తేజ "ఇజ్జో... ఇజ్జో..." అంటూ తన చిట్టి చేతుల్లోని ఆపిల్ ముక్కని ఆ ముసలమ్మకి అందించబోయాడు.

అది గమనించిన కరుణాకర్ కోపంతో విసురుగా బయటకొచ్చాడు.

ఆపిల్ ముక్కని ఆశగా అందుకోబోతూ ఆర్తిగా చాచిన ముసలమ్మ చేతిపై ఒక్కటంటించాడు. చేతిలోని సత్తుగిన్నె ఎగిరి అల్లంత దూరంలో పడింది.

"వాడు చిన్నపిల్లవాడు. నీకైనా తెలివిలేదూ? ఇంకా నయం. నే చూడకపోతే ఆపిలేం ఖర్మ. ఏకంగా వాడి మెడలో గొలుసే లాక్కునేదానివేమో! పో... పోవే ముసలిముండ. మళ్లీ కన్పించకు" అరిచి ఆ బిచ్చగత్తె మీద పడి తన్నినంత హంగామా సృష్టించాడు.

గజగజ వణికిపోయిందామె.

"కాల్మొక్త. గొలుసు లాక్కునేదాన్ని కాదు. నీ తల్లిలాంటి దాన్ని. రెక్కలుడిగి దిక్కులేక

అడుక్కుంటున్న. జర కొట్టకు కొడుకా!" చేతులెత్తి దండం పెట్టి వంగి గిన్నె తీసుకొని నెమ్మదిగా కదిలింది.

షేవింగ్ పని పూర్తయ్యాక బెడ్రూంకి వెళ్లి అటాచ్డ్ బాత్రూం డోర్ దగ్గర నిలబడ్డాడు.

"ఈ రోజు స్నానమవుతుందా మేడమ్! మ్యారేజ్ టైం మాట అటుంచి కనీసం ఫస్ట్‌నైట్ టైంకన్నా చేరతామంటావా?" చిలిపిగా అడిగాడు.

"సిగ్గులేకపోతే సరి. తలస్నానమండీ... చెప్పి పొడవక్కర్లేదు గానీ అయిపోవచ్చింది. నానీ ఉన్నాడా? ఎదురింట్లోగ్గాని దూరాడా?"

"వాడెక్కడికీ పోలేదులే. ముందు త్వరగా బయటకు వచ్చేయ్!" చెప్పి బయటి గదిలోకి వచ్చాడు.

బయట నిలబడ్డ తేజ "జేజ!... జేజ!" అంటూ బుల్లి చేతులెత్తి కేరింతలు కొడుతున్నాడు.

దేవుడి పటాలు అలంకరించిన తోపుడుబండిని నిలిపి దైవ భజన చేస్తూ, నలుగురు భక్తులు కాషాయ దుస్తుల్లో అల్లంత దూరం నుండి ఈవైపే వస్తున్నారు.

శ్రీజకి దైవభక్తి మెండు. తన భక్తిని చిన్ని తేజకందించాలని తరచూ వాడికి దేవుళ్లని చూపిస్తూ మొక్కిస్తుంటుంది.

తేజ చప్పున రెండు చేతులు జోడించి ఆ పటాలకి నమస్కరించాడు.

రోడ్డు చేరిన కొడుకు చెంతకు పరుగు పరుగున వచ్చాడు కరుణాకర్. ఆ భక్తులేమో కరుణకర్‌ని చేరారు.

"మాది ధర్మపురి. సాయి మందిరం నిర్మించ తలపెట్టాం. చందా కోసం ఊరూరా తిరుగుతున్నాం. వీలైనంత సాయమందించండి" ఒకాయన చందాబుక్ అందించాడు.

'అనాథ శరణాలయం వాళ్లు తప్పారనుకుంటే వీళ్లు తగిలారేంట్రా బాబూ!' గొణుక్కున్నాడు.

"ఆలోచించకండి. దైవకార్యం దాతలు ఎంతిస్తే అంతే చాలు"

"మీరు తలపెట్టిన దైవకార్యం అభినందనీయమే కానీ చందా మాత్రం ఇచ్చుకోలేను"

"దానం మానవ గుణం"

"కాదనడం లేదు. ఇంట్లో పెద్దాయన పోయాడు. ముట్టుడు. నా దానం పనికి రాదని.." నసిగాడు.

"దానానికి ముట్టుడికి ముడి పెడతారేం. విడ్డూరంగా ఉంది. ఇలాంటిది మేమెక్కడా విన్లేదు" ఆశ్చర్యపోయారంతా.

తడబడ్డాడు.

"దాతగా ఆయన పేరు రాసి ఎంతో కొంత దేవుడికి సమర్పించుకోండి" పట్టు వదల్లేదు వాళ్లు.

"ఎవరి నమ్మకం వారిది. బలవంతం చేయకండి" నిర్ద్వంధంగా చెప్పాడు.

"అంతా పైవాడి దయ. జై సాయిరాం! ఏం చేస్తాం పదండి" అంటూ బండిని తోసుకుని వెళ్లిపోయారు.

"ప్రతివాడూ ఏదో రూపంలో డబ్బులు గుంజే యత్నమే. చందా అడగడం ఫ్యాషనై పోయింది..." తిట్టుకుంటూ గట్టిగా తల విదిల్చాడు.

తేజ కోసం పక్కకి చూశాడు. వాడక్కడ లేడు.

'ఇంట్లోకెళ్ళాడేమో?' అనుకుంటున్న కరుణాకర్ దృష్టి రోడ్డు వైపు మళ్లింది. అక్కడ కంటపడిన దృశ్యానికి పై ప్రాణాలు పైనే పోయాయి.

రోడ్డుని క్రాస్ చేస్తూ వేగంగా దూసుకు వస్తోందొక జీపు. అక్కడొక మలుపు ఉంది. సరిగ్గా అదే సమయానికి ఎదురింట్లోకి వెళ్లే ప్రయత్నంలో తేజ.

క్షణమాలస్యం జీపు కుర్రాణ్ని గుద్దేసేదే. ఏ అదృశ్య హస్తమో ఆ బాబుని మృత్యువాత పడకుండా కాపాడింది.

ఆ అమృత హస్తం ముసలమ్మది! రోడ్డుకి ఆవలి వైపు ఇంటి ముందు అడుక్కుంటున్నదల్లా ప్రమాదం పసిగట్టి... వణుకుతున్న చేతుల్తో తేజని తన వైపు లాక్కుంది కానీ... బాలెన్స్ తప్పి తను ముందుకు తూలి పడింది.

పొరపాటు గ్రహించి ప్రమాదాన్ని పసిగట్టిన డ్రైవర్ సడెన్ బ్రేక్ వేసేలోగా... ఊహించని విధంగా ముసలమ్మ బలి అయ్యింది.

బెదిరిన తేజ అంతెత్తున ఏడ్పు లంకించుకున్నాడు.

బాబు ఏడ్పు విని పరుగెత్తుకు వచ్చిన శ్రీజ అక్కడి సీన్‌కి షాకయింది.

రక్తపు మడుగులో ముసలమ్మ...

స్పాట్ డెడ్!

ఒక్క గెంతుతో కరుణాకర్ అక్కడికి చేరుకున్నాడు. గభాల్న కొడుకుని ఎత్తుకున్నాడు. వాడిని ఆబగా ముద్దాడాడు.

"ఆ ముసలమ్మ కాపాడకుంటే తమ సర్వస్వం... తమ లోకం.. బాబు తమకి దక్కేవాడా?" ముచ్చెమటలు పోశాయి కరుణాకర్‌కి.

"అమ్మా! నీవెవరో తెలీదు. ఏ లోకానికేగినా నన్ను క్షమించు. మృత్యుఒడి చేరాల్సిన నా కొడుకుకి ప్రాణదానం చేసి క్షేమంగా నా ఒడి చేర్చావు.

**'సాటి మనిషికి సహాయపడటమే మనిషికి సార్థకత' అనే జీవిత సత్యాన్ని నాలో ఆవిష్కరించి నా అహాన్ని తుడిచేశావు!**

నా పేరులోనే దాగున్నా, ఇన్నాళ్లూ కనుక్కోలేక పోయిన కరుణని మేల్కొలిపావు" తొలిసారిగా అణువణువూ చలించిపోయాడతను.

"బా.. బాబుకి ఏం కాలేదుగా?" భర్త పక్కన చేరిన శ్రీజ వణుకుతున్న చేతుల్తో

బాబుని తీసుకుంటూ ఆత్రంగా అడిగింది.

ఆలోచనల్నుండి తేరుకున్న కరుణాకర్ అడ్డంగా తలూపాడు.

ఆర్తిగా బిడ్డని తన గుండెలకి హత్తుకొని ఆప్యాయతతో తడిమింది.

"ఆమె ఎవరండీ?" భర్తనడిగింది.

"తెలీదు. మన వీధిలో బిచ్చమెత్తుకుంటోంది"

ఆక్సిడెంట్ విషయం తెల్సిన జనం పోగయ్యారు.

"బిచ్చగత్తెనా! అయ్యోపాపం... తనకెవరైనా ఉన్నారో? లేరో?" జాలి పడింది.

"వాకబు చేస్తాను. బంధువులుంటే శవాన్ని అప్పగిస్తాను. ఎవరూ లేకుంటే ఈ అనాథకు... కాదు మన ప్రాణదాతకు... పోస్ట్‌మార్టం అనంతరం స్వయంగా దహన సంస్కారాలు జరిపిస్తాను. ముసలమ్మకి ఈ సాయం కూడా చేయకుంటే అది మానవత్వ మన్పించుకోదు" దృఢంగా పలికాడు.

భర్తలోని మార్పుకి సంతసించిందామె.

**(26.01.2008)**

*